5 రోజులు వానలు

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఏపీలోని నెల్లూరు జిల్లా తడ సమీపంలో 22 కిలోమీటర్ల వేగంతో తీరాన్ని తాకిందని వాతావరణ శాఖ గురువారం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా, రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశముందన్నారు. తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్‌ను జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, జయశంకర్- భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గురువారం మోస్తరు వర్షాలు కురిశాయని చెప్పింది. శుక్రవారం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ-గద్వాల జిల్లాల్లో వానలు పడుతాయని ఐఎండీ అంచనా వేసింది. గడిచిన 24 గంటల్లో రాజన్న-సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో అత్యధికంగా 7.06 సెం.మీ వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో 5.73 సెం.మీ, పాల్వంచలో 5.15 సెం.మీ, దోమకొండలో 4.39 సెం.మీ, కరీంనగర్‌లో 5.54 సెం.మీ, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో 4.69 సెం.మీ, వికారాబాద్ జిల్లా బషీర్‌బాద్‌లో 3.83 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.

మెడికల్ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ

హైదరాబాద్, అక్టోబర్17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్, తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ సంయుక్తాధ్వర్యంలో ఎస్సీ యువతకు పలు మెడికల్ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ప్రాజెక్టు మేనేజర్ సైదులు గురువారం ప్రకటన విడుదల చేశారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఫిజియోథెరపి టెక్నీషియన్, అసిస్టెంట్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు భోజన వసతి కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. మేడ్చల్, మిర్యాలగూడ, సంగారెడ్డిలో శిక్షణ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 98485 81100, 97047 82992 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సినీ నటుడు సుమన్‌కు వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకులు

చరిత్రలో కేసీఆర్ నిలిచిపోతారు

- **యాదగిరిగుట్ట పునర్నిర్మాణం అద్భుతం: సుమన్**

యాదగిరిగుట్ట, అక్టోబర్ 17: యాదగిరిగుట్ట ఆలయాన్ని ఎంతో అద్భుతంగా పునర్నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రముఖ సినీ నటుడు సుమన్ కితాబునిచ్చారు. గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణ సమయంలో స్వామివారి దర్శించుకున్నానని, ఆలయ పునఃప్రారంభమైన అనంతరం మొదటిసారిగా వచ్చానని తెలిపారు. గతంతో పోలిస్తే ఆలయం ఎందో అద్భుతంగా కనిపిస్తున్నదని తెలిపి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో లక్ష్మీనరసింహస్వామి అంటే యాదగిరిగుట్ట ఆలయమే అని చర్చించుకునే స్థాయిలో ఉందని తెలిపారు.



ఈవో భాస్కర్‌రావుకు చెక్కును అందిస్తున్న కంకర్ సుధ్వర్‌రెడ్డి

విమానగోపురానికి 10 లక్షల విరాళం

యాదగిరిగుట్ట, అక్టోబర్ 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం విమానగోపురం స్వర్ణతాపడానికి హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధ్వీర్‌రెడ్డి గురువారం రూ. 10 లక్షల 116 విరాళంగా సమర్పించారు. స్వామివారి దర్శించుకున్న ఆనంతరం ఆలయ ఈవో భాస్కర్‌రావుకు చెక్కును అందజేశారు.

ఆర్థికంగా ఆదుకుంటా రండి..!

- **కాళ్లు, చేతులు, కండ్లు లేని వారికి సాయం చేస్తాం**
- **పోచమ్మకుంటలో ఇంటి ముందు ఫ్లెక్సీ కట్టిన వృద్ధుడు**

హనుమకొండ పోచమ్మకుంటలోని తన నివాసంలో ఐలయ్య దంపతులు

నయింనగర్, అక్టోబర్ 17: కాళ్లు, చేతులు, కండ్లు లేవని బాధపడుతున్నారా.. మీకు తోడుంటా.. మిమ్మల్ని ఆర్థికంగా ఆదుకుంటా.. అని ఓ వృద్ధుడు తన ఇంటి ఎదుట ఫ్లెక్సీ కట్టి ఆర్థికంగా సాయం చేసేందుకు ముందుకొచ్చాడు. కమలాపూర్ మండలం భీంపెల్లికి చెందిన సముద్రాల ఐలయ్య 1986లో గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంటకు కూలి కోసం వచ్చాడు. ఇక్కడే స్థిరపడి అంచెలంచెలుగా ఎదిగాడు. ఇప్పుడు వృద్ధాప్యంలో కూతురు విజయలక్ష్మి, కుమారుడు రజినీకాంత్ సరిగా చూసుకోకపోవడంతో తమ డబ్బు పేదలకు చెందాలనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నట్టు చెప్పాడు. తమ దగ్గరకు వచ్చిన వారి అడ్రస్ తీసుకొని వారికి ఏ సమస్య ఉన్నా, ఆస్తులు అమ్మి ఆదుకుంటామని 'నమస్తే తెలంగాణ'కు తెలిపాడు. ఇప్పటికే రూ.25 లక్షలకు పైగా పంపిణీ చేశామన్నారు.

నడిరోడ్డుపై పాఠాలు

దామరగిద్ద, అక్టోబర్ 17 : నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాల విద్యార్థుల చదువు రోడ్డెక్కింది. పాఠశాలకు కేసీఆర్ ప్రభుత్వం నిధులు కేటాయించి భవనం కట్టినా నేటికీ సీసీ రోడ్డుపైనే చదువు చెబుతుండడం గమనార్హం. మూడు నెలల కిందట స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి వచ్చి నూతన భవనాన్ని ప్రారంభించినా నేటికీ సీసీ రోడ్లపై, పాత అద్దె భవనంలో తరగతులు కొనసాగించడం కొసమెరుపు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు.

వీడియోగ్రఫీతో శాస్త్రీయ ఆధారాలు

సీఐడీ డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): నేరం జరిగినప్పుడు శాస్త్రీయ ఆధారాలు సేకరించేందుకు వీడియోగ్రఫీ ఎంతో అవసరమని సీఐడీ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. రెండోరోజూ నిర్వహించిన పోలీస్ డ్యూటీమీట్‌లో వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులకు ఇన్వెస్టిగేషన్, బాంబు తనిఖీలు, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, పోలీసు వీడియోగ్రఫీపై శిక్షణ, అవగాహన కల్పించినట్టు చెప్పారు. పలు ఈవెంట్లలో రాతపరీక్షలు కూడా నిర్వహించినట్టు పేర్కొన్నారు. కొత్త చట్టాల్లో వీడియోగ్రఫీ ప్రాధాన్యం మరింత పెరిగిందని తెలిపారు.

21 నుంచి డీఈఈ సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ డీఈఈ సెట్-2024 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. రెండేండ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 21 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు సెట్ కన్వీనర్ గురువారం ప్రకటనలో తెలిపారు. 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, 23 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని, 30న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారని తెలిపారు. 30 నుంచి వచ్చే నెల 3 వరకు ఫీజు చెల్లింపు, అడ్మిషన్ కార్డు డౌన్‌లోడ్‌కు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 4లోగా రిపోర్ట్ చేయాలని కన్వీనర్ వివరించారు.

50 ప్రశ్నలతో సోషల్ సర్వే?

- **ఇంటి యజమాని బ్యాంకు ఖాతా, సామాజిక వివరాల సేకరణ**
- **రెండు, మూడు రోజుల్లో సర్వే ఫార్మాట్ సిద్ధం**
- **సీఎస్‌తో ఆర్థిక, ప్రణాళికశాఖ అధికారుల చర్చలు**
- **ప్రణాళిక శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత**

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సోషల్ ఎకనామిక్ సర్వే నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర కసరత్తు చేస్తున్నది. 60 రోజుల్లో సర్వే పూర్తిచేయాలని సర్కారు ఆదేశించిన నేపథ్యంలో ఫార్మాట్ రూపకల్పనపై మంతనాలు కొనసాగుతున్నాయి. సర్వే విధివిధానాలపై సీఎస్‌తో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, ఆర్థిక, ప్రణాళికశాఖ సీనియర్ అధికారులు సుదీర్ఘ చర్చలు జరుపుతున్నారు. రెండు, మూడు రోజుల్లో సర్వేకు సంబంధించిన ఫార్మాట్ సిద్ధమవుతుందని ఆర్థిక, ప్రణాళికశాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఇంటి యజమాని బ్యాంకు ఖాతా నంబర్‌తోపాటు కుటుంబ పూర్తి వివరాలను రాబట్టేందుకు 50 ప్రశ్నలను సర్వేపత్రంలో పెట్టే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిపాయి.

అనేక అంశాలతో ముడిపడిన సర్వే

రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి కులాలవారీగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలపై సర్వే చేపట్టాలని ఆదేశిస్తూ సీఎస్ శాంతికుమారి ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సర్వే నిర్వహణకు ప్రణాళిక శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించారు. అయితే, ఈ సర్వే ఫలితాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు నిర్ణయం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నది.

ఎన్యూమరేటర్లే కీలకం..

సోషల్ సర్వేలో ఎన్యూమరేటర్ల ఎంపిక కీలకంగా మారింది. గతంలో జన గణనకు టీచర్లు సేవలందించారు. తాజా సర్వేకు అంగన్‌వాడీ టీచర్లు లేదా నిరుద్యోగులను ఎన్యూమరేటర్లుగా తీసుకోవాలని చర్చకు వచ్చినట్టు సమాచారం. అయితే, కుటుంబాలకు సంబంధించిన కీలక విషయాలు రాబట్టాల్సి ఉన్నందున అనుభవజ్ఞులనే ఎన్యూమరేటర్లుగా తీసుకోవాలని భావిస్తున్నారు. ఆర్థిక, ప్రణాళిక శాఖ సిబ్బందికి అనేక సర్వేలు నిర్వహించిన అనుభవం ఉండగా, ప్రస్తుతం ఆ శాఖను సిబ్బంది కొరత వేధిస్తున్నది. 1,180మంది మాత్రమే ఉన్నారని, మరో 200మంది సిబ్బంది (క్యాడర్‌స్ట్రెంత్) కోసం 10నెలల క్రితం ప్రతిపాదనలు పంపామని, ఆ ఫైల్ సీఎం పేషీలో పెండింగ్‌లో ఉన్నట్టు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

సిబ్బందికి శిక్షణ

ఎన్యూమరేటర్ల ఎంపిక పూర్తయితే వారికి సర్వేపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో అప్పటి సీఎం కే చంద్రశేఖర్ రావు సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని స్వయంగా ప్రజలకు పిలుపునిచ్చారు. దీంతో అందరూ సొంతూళ్లకు వెళ్లడంతో ఒక్కరోజులోనే సర్వే పూర్తయింది. కానీ, ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. అందుకే అన్ని అంశాలపై అధికారులు కూలంకషంగా చర్చిస్తున్నారు.

సర్వే ప్రశ్నలపై కసరత్తు..

సర్వేలో సేకరించాల్సిన నిర్దిష్ట సమాచారంపైనా అధికారులు లోతుగా చర్చిస్తున్నట్టు ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఓసీ కులానికి చెందిన భర్త, ఎస్సీ కులానికి చెందిన భార్య ఉంటే ఆ కుటుంబాన్ని ఏ కులంగా పరిగణనలోకి తీసుకోవాలి? మైనార్టీకి చెందిన భార్య, బీసీ కులానికి చెందిన భర్త ఉంటే దేనిని ప్రామాణికంగా తీసుకోవాలి? అనే అంశాలపై అధికారులు చర్చిస్తున్నారు. థర్డ్ జెండర్ లెక్కలు కూడా తేల్చనున్నారు. రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు వంటి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? కుటుంబ వార్షిక ఆదాయం ఎంత? వంటి అంశాలు తెలుసుకొనేందుకు కుటుంబ యజమాని బ్యాంకు ఖాతా నంబర్ కూడా సేకరించాలనే యోచనలో ఉన్నట్టు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

భరూచ్ అల్లర్ల కేసు.. నేపాల్‌కు పారిపోయేందుకు నిందితుల యత్నం

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరికి గాయాలు

భరూచ్ (యూపీ), అక్టోబర్ 17: యూపీలోని భరూచ్‌లో ఒక యువకుడిని హత్య చేసి హింసకు కారకులైన ఐదుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నేపాల్‌కు పారిపోతున్న వీరిని పట్టుకునే క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు గాయపడినట్టు చెప్పారు. ఈ ఐదుగురు నిందితులు ఆదివారం భరూచ్‌లో దుర్గా పూజ ఊరేగింపు సందర్భంగా 22 ఏండ్ల యువకుడిని చంపడంతో హింస చెలరేగింది. మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఈ ఐదుగురు ప్రయత్నించినట్టు పోలీసులు నిర్ధారించారు. దీంతో భరూచ్ జిల్లాకు ఆనుకుని సరిహద్దు ద్వారా నేపాల్‌లోకి పారిపోవడానికి వీరు ప్రయత్నించారు. ఈ క్రమంలో నేపాల్ సరిహద్దులో వీరిని అరెస్ట్ చేశారు.

ప్రధాని మోదీ వస్తే బాగుండేది: షరీఫ్

ఇస్లామాబాద్, అక్టోబర్ 17: ఇస్లామాబాద్ వేదికగా జరిగిన 'షాంఘై కోఆపరేషన్ సదస్సు'కు భారత ప్రధాని మోదీ హాజరై ఉంటే బాగుండేదని పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అభిప్రాయపడ్డారు. భారత్-పాక్ ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొనేందుకు విదేశాంగ మంత్రి జైశంకర్ పాక్‌కు రావటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విభేదాలతో 75 ఏండ్లు గడిచిపోయాయని, ఇరు దేశాల మధ్య నెలకొన్న విభేదాల్ని పరిష్కరించుకోకుండా, మరో 75 ఏండ్లు వృథా చేయటం సరైంది కాదని అన్నారు.

12 సీట్లు ఇవ్వకపోతే సొంతంగా పోటీ

ముంబై, అక్టోబర్ 17: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమకు 12 సీట్లు కేటాయించాలంటూ మహావికాస్ అఘాడీ కూటమిని సమాజ్‌వాదీ పార్టీ డిమాండ్ చేసింది. ఇండియా కూటమిలో భాగస్వామి అయిన తమకు కనీసం 12 సీట్లు ఇవ్వకపోతే సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించింది. తమది దేశంలోనే మూడో అతి పెద్ద పార్టీ అని, తమను ఎట్టి పరిస్థితుల్లో తేలికగా చూడరాదని ఆ పార్టీ యూపీ అధ్యక్షుడు అబూ అసీమ్ అజ్మీ పేర్కొన్నారు.

పట్టాలు తప్పిన 'లోకమాన్య తిలక్'

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: దేశంలో రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. గురువారం అస్సాంలో 'లోకమాన్య తిలక్' ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదని సమాచారం. అగర్తల నుంచి ముంబైకి బయల్దేరిన ఎక్స్‌ప్రెస్ రైలులోని 8 బోగీలు డిబాలాంగ్ స్టేషన్ వద్ద పట్టాలు తప్పాయని రైల్వే అధికార ప్రతినిధి మీడియాకు తెలిపారు. 'రైలు పవర్ కార్ సహా 8 కోచ్‌లు పట్టాలు తప్పాయి. ప్రయాణికులు ఎవ్వరూ గాయపడలేదు' అని నార్త్‌ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే జోన్ అధికారి ఒకరు చెప్పారు. ఘటనాస్థలానికి సహాయక బృందాలు, మెడికల్ బృందం వెళ్లినట్టు తెలిపారు. ఘటనాస్థలం వద్ద రైల్వే లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

ఈ ఏడాది 15 మంది మృతి

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యూపీలోని మీర్జాపూర్‌కు చెందిన అశుతోశ్ చౌరాసియా (20) అనే విద్యార్థి కోటాలో ఉంటూ నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. బుధవారం రాత్రి తాను నివాసముంటున్న రూములో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. దాదాబరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కోచింగ్ హబ్‌గా పేరొందిన కోటాలో గత ఏడాది 29 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 15 మంది ఉసురు తీసుకున్నారు.

ఆర్మీ దంపతుల ఆత్మహత్య

ఒకరు ఢిల్లీలో.. మరొకరు ఆగ్రాలో..

న్యూఢిల్లీ: ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పని చేస్తున్న తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసిన కొన్ని గంటలకే ఆర్మీ కెప్టెన్‌గా పనిచేస్తున్న అతడి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఆగ్రాలోని మిలిటరీ నర్సింగ్ సర్వీస్‌లో కెప్టెన్‌గా నియమితురాలైన రేణు మంగళవారం ఢిల్లీలోని ఆఫీసర్స్ మెస్‌లో ఉరేసుకున్నారు. తన చావుకు ఎవరూ కారణం కాదని ఆమె ఆత్మహత్య లేఖలో పేర్కొన్నారు. తన భర్త పక్కనే తనను ఖననం చేయాలని కోరారు. భారత వైమానిక దళంలో ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న ఆమె భర్త దీన్ దయాళ్ దీప్ మంగళవారం ఉదయం ఆగ్రాలోని ఆఫీసర్స్ క్వార్టర్‌లో ఉరేసుకున్నారు.

'భారత్ మాతా కీ జై' అంటేనే బెయిల్

భోపాల్: భారత వ్యతిరేక, పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసిన ఓ నిందితుడికి మధ్యప్రదేశ్ హైకోర్టు తిక్క కుదిర్చింది. అతడికి బెయిలు మంజూరు చేస్తూ ఊహించని షరతులు విధించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది మే 17న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. భోపాల్ సమీపంలోని మిస్రోద్‌లో ఓ పంక్చర్ షాప్ నిర్వహించే ఫైసల్‌ఖాన్ ఆ వీడియోలో 'పాకిస్థాన్ జిందాబాద్', 'భారత్ ముర్దాబాద్' అని నినాదాలు చేయడం కనిపించింది. దీంతో అతడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఫైసల్‌ఖాన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో తాజాగా మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ దినేశ్ కుమార్ పలివాల్ అతడికి బెయిలు మంజూరు చేస్తూ.. ఫైసల్ తన దేశభక్తిని బహిరంగంగా ప్రదర్శించాలని షరతు విధించారు. జాతీయ జెండాకు 21సార్లు వందనం చేయాలని, నెలకు రెండుసార్లు 'భారత్ మాతా కీ జై' అని నినదించాలని షరతులు పెట్టారు. కేసు ముగిసే వరకు ప్రతినెల మొదటి, నాలుగో మంగళవారం మిస్రోద్ పోలీస్ స్టేషన్‌లోని జెండా స్తంభం వద్ద ఇలా చేయాలని ఆదేశిస్తూ ఫైసల్‌కు బెయిలు మంజూరు చేశారు.

కార్పొరేట్లకు కోత.. వేతన జీవులకు వాత

- **ప్రభుత్వ పన్ను ఆదాయంలో 30 శాతం వ్యక్తిగత ఆదాయ పన్ను నుంచే..**
- **2004-05లో ఇది 16.2 శాతమే**
- **మరోవైపు తగ్గిన కార్పొరేట్ ట్యాక్స్ వాటా**
- **కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించడమే కారణం**

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: సగటు వేతనజీవి నుంచి ముక్కు పిండి పన్ను వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌లకు మాత్రం పన్నులను కుదిస్తున్నది. ఫలితంగా ప్రభుత్వ మొత్తం పన్ను ఆదాయంలో ప్రజలు కట్టే వ్యక్తిగత ఆదాయ పన్ను వాటా పెరుగుతుండగా, కార్పొరేట్ పన్నుల వాటా మాత్రం తగ్గుతున్నది. ముఖ్యంగా కార్పొరేట్ ట్యాక్స్ రేట్లను మారుస్తూ 2019లో మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వానికి రావాల్సిన కార్పొరేట్ ట్యాక్స్ తగ్గిపోతున్నది. 2000-01 నుంచి 2023-24 మధ్య వసూలైన పన్నుల వివరాలను ఆదాయ పన్ను శాఖ గురువారం వెల్లడించింది. ఇందులో ఈ విషయాలు స్పష్టమయ్యాయి.

పెరిగిన వ్యక్తిగత ఐటీ వాటా

ప్రత్యక్ష పన్నులు(వ్యక్తిగత ఐటీ, కార్పొరేట్ ట్యాక్స్ వంటివి), పరోక్ష పన్నులు(జీఎస్‌టీ, ఎక్సైజ్, కస్టమ్స్ డ్యూటీ వంటివి) కలిపి ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులో వ్యక్తిగత ఆదాయ పన్ను వాటా 2004-05లో 16.2 శాతంగా ఉండగా, 2023-24లో ఏకంగా 30.2 శాతానికి పెరిగింది. ప్రత్యక్ష పన్నులో చూసుకుంటే 2023-24లో వ్యక్తిగత ఆదాయ పన్ను వాటానే 53.3 శాతంగా ఉంది. ఇప్పుడు విడుదల చేసిన 24 ఏండ్ల డాటాలో ఇదే అత్యధికం.

తగ్గుతున్న కార్పొరేట్ పన్ను వాటా

ఇదే సమయంలో ప్రభుత్వ మొత్తం పన్ను వసూళ్లలో కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతున్నది. ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్ ట్యాక్స్ వాటా 2018-19లో 58.3 శాతం ఉండగా, 2023-24 నాటికి పెరగకపోగా 46.5 శాతానికి తగ్గింది. 2019లో కార్పొరేట్ పన్నులను మోదీ ప్రభుత్వం తగ్గించడమే ఇందుకు కారణమని స్పష్టమవుతున్నది. ఈ నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు కార్పొరేట్ పన్ను వసూలు 64 శాతం మాత్రమే పెరగగా, వ్యక్తిగత పన్ను వసూలు మాత్రం 112 శాతం పెరిగింది. ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయనే ఆశతో 2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ ట్యాక్స్ రేట్లను మోదీ ప్రభుత్వం తగ్గించడమే ఇందుకు కారణమని, అయినా పెట్టుబడులు మాత్రం పెరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

గర్భంలోని పిండంలోకి మైక్రోప్లాస్టిక్!

న్యూయార్క్: భూమిపై అన్ని జీవాల పాలిట మైక్రోప్లాస్టిక్ ముప్పుగా మారుతున్నది. ఇందుకు సంబంధించి అమెరికాలోని రట్జర్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఆందోళన కలిగించే విషయాన్ని వెల్లడించారు. ఎలుకలపై వీరు చేసిన ప్రయోగం వివరాలు 'సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్‌మెంట్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మావి ద్వారా తల్లి నుంచి పిండంలోకి గర్భంలోనే మైక్రోప్లాస్టిక్ చేరుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. పాలిమైడ్-12(పీఏ-12) అనే రకమైన ప్లాస్టిక్‌ను తిన్న ఎలుకలకు పుట్టిన రెండు ఎలుక పిల్లలను రెండు వారాల తర్వాత పరిశోధకులు పరీక్షించారు. తల్లిగర్భం నుంచి వీటిల్లోకి మైక్రోప్లాస్టిక్ చేరాయని, పుట్టిన తర్వాత కూడా ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, మెదడు కణజాలంలో మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు గుర్తించారు. మనుషులకూ ఈ ప్రమాదం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు.

ఇరాన్‌లో 250 మంది అఫ్గాన్ వలసదారుల ఊచకోత!

దేశంలోకి చొరబడుతుండగా కాల్చివేత

టెహ్రాన్, అక్టోబర్ 17: తమ దేశంలోకి అక్రమంగా చొరబడటానికి ప్రయత్నించిన అఫ్గానిస్థాన్‌కు చెందిన 250 మంది పౌరులను ఇరాన్ సరిహద్దు భద్రతా దళాలు గత వారం హతమార్చాయి. పాకిస్థాన్ నుంచి అక్రమంగా ఇరాన్‌లోకి వీరు ప్రవేశించడానికి ప్రయత్నించగా ఈ ఊచకోత జరిగిందని, దీనిపై తాలిబన్ అధికారులు దృష్టిసారించినట్టు మీడియా కథనాలు వెలువడ్డాయి. ఈ వార్తల్లోని నిజానిజాలను తమ దౌత్య వర్గాలు, ప్రభుత్వ సంస్థలు దర్యాప్తు చేస్తున్నట్టు కాబుల్‌లోని తాలిబన్ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రాట్ తెలిపారు. ఈ వార్తలను ఇరాన్ అధ్యక్షుడి ప్రతినిధి హసన్ కజేమి ఖొమి ఖండించారు.

నేనూ సీఎం అయ్యే అవకాశం

వాల్మీకి స్కామ్ నిందితుడు, మాజీ మంత్రి నాగేంద్ర

బళ్లారి: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ముడా స్కామ్‌లో ఇరుక్కోవడంతో సీఎం పదవిని కోరుకుంటున్న ఆశావహుల సంఖ్య ఆ పార్టీలో రోజురోజుకు పెరిగిపోతున్నది. ఈ క్రమంలో కోట్ల రూపాయల వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్ట్ అయిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే బీ నాగేంద్ర గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయ్యే అవకాశం ఉన్నందున తనకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందన్నారు. ఇప్పటికే 18 క్రిమినల్ కేసులు ఉన్న ఆయన దానిని సమర్థించుకుంటూ 100 క్రిమినల్ కేసులున్న వారు కూడా ముఖ్యమంత్రులైన సంఘటనలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు అంకిత భావంతో పనిచేస్తే భవిష్యత్తులో ఎందుకు సీఎంని కాకూడదు? అని ఆయన పేర్కొన్నారు. తనను తిరిగి మంత్రిని చేసేదీ లేనిది అధిష్ఠానం ఇష్టమని చెప్పారు. పార్టీలో ఎదుగుతున్నందునే బీజేపీ తనను టార్గెట్ చేసిందని నాగేంద్ర ఆరోపించారు.

హౌతీ ఆయుధ డిపోలపై బీ-2 బాంబర్లతో దాడులు

తొలిసారి ఉపయోగించిన అమెరికా

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: యెమెన్‌లో హౌతీ తిరుగుబాటు దళాలపై ఇప్పటివరకు సాధారణ ఫైటర్ జెట్‌లను వాడిన అమెరికా, అత్యంత భీకరమైన అడ్వాన్స్‌డ్ 'బీ-2' స్టెల్త్ బాంబర్స్‌ను రంగంలోకి దింపింది. బుధవారం సాయంత్రం నుంచి యెమెన్‌లో హౌతీ తిరుగుబాటు దళాల స్థావరాలపై బీ-2 యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. హౌతీ ఆయుధ డిపోలు లక్ష్యంగా బీ-2 స్టెల్త్ బాంబర్స్ దాడులు గురువారం కూడా కొనసాగాయి. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటు దళాలకు చెందిన ఐదు అండర్‌గ్రౌండ్ ఆయుధ స్థావరాల్ని నామరూపాల్లేకుండా చేసినట్టు అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ స్వయంగా తెలిపారు. అత్యంత భారీ విధ్వంసాన్ని సృష్టించే బాంబులను ప్రయోగించటం, సుదూర లక్ష్యాలను ఛేదించటం 'బీ-2' బాంబర్ల ప్రత్యేకత. దాదాపు ఒక బిలియన్ డాలర్ విలువజేసే (రూ.8వేల కోట్లు) అడ్వాన్స్‌డ్ బీ-2 యుద్ధ విమానాలను యెమెన్ యుద్ధంలో అమెరికా వాడటం ఇదే మొదటిసారి.

హసీనాపై అరెస్ట్ వారెంట్

నవంబర్ 18లోగా హాజరు పరచాలని ఐసీటీ ఆదేశం



ఢాకా, అక్టోబర్ 17: బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్(ఐసీటీ) ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాపై గురువారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకు ఆమెతో పాటు మరో 45 మందిపై ట్రిబ్యునల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. వారెంట్లు జారీ అయిన వారిలో హసీనా పార్టీ అవామీ లీగ్ అగ్ర నేతలు ఉన్నట్టు ఢాకా ట్రిబ్యూన్ వార్తా పత్రిక పేర్కొంది. వీరందరినీ నవంబర్ 18లోగా తమ ముందు హాజరు పరచాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. హసీనా, అవామీ లీగ్ నాయకులు, కూటమిలోని 14 రాజకీయ పార్టీల నేతలు, పాత్రికేయులు, మాజీ ఉన్నతాధికారులపై ఐసీటీలో 60కి పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు ఉధృతం కావడంతో ఆగస్టు 5న హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే.